11

# ఆత్మీయులు

"ఆఫీసు కెళ్తున్నానత్తయ్యా..." అంటూ, వయ్యారంగా గడపదాటింది వసంత. లూటీకి గురైన చేనులాగున్న వంటిల్లు సర్దడంతో సతమతమవుతున్న భారతమ్మ 'సరే.... వెళ్ళి రామ్మా' అంది లోపల్నుండే.

స్కూటర్ స్టార్ట్ జేసి బయట తన కొరకే ఎదురుచూస్తున్న భర్త వెనుక కూచుని 'పదండి' అంది నాజూగ్గా వసంత.

ఝుమ్మంటూ జెట్ విమానంలా దూసుకు పోయింది స్కూటర్.

భారతమ్మ కొడుకూ; కోడలూ ఇద్దరూ ఉద్యోగస్తులే. పెందరాలే నిద్రలేచి గబగబా వంటపని తెమిలితే నాలుగు మెతుకులు నోట్లో కుక్కుకుని టిఫిన్ బాక్స్లతో బయల్దేరుతారిద్దరూ. తిరిగి సాయంత్రానికొస్తారు వాడిపోయిన కూరాకుల్లా.

ఐదు నిమిషాలు కాగానే

"అమ్మా ఏం చేస్తున్నావే....?"అంటూ సరాసరి వంట గదిలోకొచ్చింది కూతురు వాసంతి హడావుడిగా.

"ఏమ్మా అఫీసుకేనా ..." ఆప్యాయంగా కాఫీ కప్పు అందించబోయింది.

"టైం లేదమ్మా.... బయట మీ అల్లుడు స్కూటరాపి

చూస్తున్నాడు. నేనొస్తా" అంటూ గిరుక్కుమన్న వాసంతి వాలకానికి నివ్వెరబోయింది. కూతురూ అల్లుడూ కూడా ఉద్యోగస్తులే. అదే వీధిలో వుంటారు. ఇద్దరూ ఆఫీసుకెల్తూ రెండేళ్ళ కొడుకు అగ్నివేష్‌ను ఆవిడ దగ్గర వదిలేసి వెళ్తారు. తిరిగి సాయంత్రం తీసికెళ్తారు.

వాసంతికి పై మనిషిగానీ, పనిమనిషి గానీ లేరు. పాపం! ఇంటెడు చాకిరి ఒక్కత్తె ఎలా చేసుకుంటుందో! కూతురు పరిస్థితికి జాలేస్తుంది భారతమ్మకు అప్పుడప్పుడు.

వంటిల్లు సర్దడం పూర్తి కాలేదింకా. ఆర్నెల్ల మనవరాలు గుక్క పెట్టి ఏడుస్తోంది. కొడుకు కూతురా పాప. గబగబా ఊయల దగ్గరకెళ్ళింది. మనవడు అగ్నివేష్ ఆ చంటిదాన్ని బుగ్గల మీద కొడుతూ ఆడుతున్నాడు. ఊళ్ళోవాళ్ళ నోళ్ళన్నీ తనవైపేనన్నట్టు అరుస్తోందా చిన్నారి.

"ఒరే బడవన్నాకా...! అది నీ మరదల్రా! అప్పుడే దాన్ని కొడుతున్నావా?" అంటూ మనవణ్ణి పక్కకు తప్పించి ఊయల ఊపింది. కణకణమండే నిప్పుల మీద నీళ్ళు జల్లినట్టుందావిడ మనసుకు— ఇంటి కప్పెగిరిపోయేలా ఏడుస్తున్న పాప చప్పున ఊరుకుని నిద్రలోకి జారుకుంది.

అగ్నివేష్‌ను తీసుకుని మళ్ళీ వంటింట్లో కెళ్ళింది.

కాలేజికెళ్ళిన నాటికీ, ఆఫీసుకెల్తున్న నాటికీ ఎంత తేడా వాసంతిలో... అటున్న పిల్ల ఇటు పెట్టని కూతురు... మరిప్పుడో...!

ఇంటెడు ఛాకిరీ చేసుకుంటూ, పిల్లలకూ, భర్తకూ ఏ లోటూరా కుండా చూసుకుంటుంది. ఉద్యోగం కూడా చేస్తుంది.

ఐనా...అల్లుడు వాళ్లమ్మను రప్పించుకుంటే బావుండేదేమో! వాసంతికి సాయంగానూ వుండేది. తనకీ హైరానా కాస్త తగ్గేది. అల్లుకు పోతున్న ఆలోచనల్తో గ్యాసు పొయ్యి తుడుస్తుంటే 'ఢభీ' మన్న శబ్దం వినిపించింది వెనకనుంచి.

గద్దె మీంచి మంచినీళ్ళ బిందెను నెట్టేసి కిలకిలా నవ్వుతు న్నాడు అగ్నివేష్. ఇంతకుముందే తుడిచిన వంటిల్లు నీటితో నిండిపోయింది. నెత్తీ నోరు కొట్టుకోవాలనిపించింది.

వాడి చెంప మీద ఒక్కటంటించాలనిపించింది. కాని వాడు వాళ్ళమ్మతో చెబితే ఏమనుకుంటుందో!

వసారాలోకి తీసుకొచ్చి వాడికో చాక్లెట్ ఇచ్చింది తింటూ కూచొమ్మని. వాడలాగే చేస్తానన్నాడు తలాడించి.

కొత్త బిందె... చొట్టపోయి దిక్కులేని దానిలా పడుంది. బిందె లేవనెత్తుతూంటే అదోలాగనిపించింది.

కొడుకు, కోడలు దెబ్బలాడుకుని రెండొందలు పోసి కొను క్కొచ్చిన బిందె... వారం రోజులు కూడా కాలేదు.

నీళ్ళన్నీ తుడిచేసరికి గంటసేపైంది. కాళ్ళూ చేతులూ పీకుతునా యప్పటికే. నరాలు మొరాయిస్తున్నాయి. చేతులు తుడుచుకుంటూ బయటికొచ్చింది మూతిని మూడు ముళ్ళు బిగించి అలిగి కూచున్నాడు అగ్నివేష్-చాక్లెట్ అయిపోయిందని. వాడిని ప్రసన్నం చేసుకోవాలని ప్రయత్నిస్తుంటే బయట ఐస్క్రీం

అమ్ముతున్న కుర్రాడి వైపు వేలుబెట్టి చూపించాడు మూతి ముడి తిప్పకుండా. ఐస్క్రీం కొనివ్వగానే వాడి మొహం ముద్దబంతి పూవుల్లా విచ్చుకుంది.

వంటింట్లో ఎలుకల దండు బియ్యండబ్బామూత ఊడదీసే ప్రయత్నంలో ఘోరంగా విఫలమై ద్విగిణీకృతోత్సాహంతో విజృంభించాయి. అమాంతం డబ్బాను కిందికి నెట్టెయ్యడంలో ఘన విజయం సాధించాయి. ధమ్మన్న పెద్ద శబ్దం విని పరుగెత్తిందంటు బియ్యం చెల్లాచెదరై వంటిల్లంతా నిండాయి. పారిపోతున్న ఎలుకల్ని చీరెయ్యాలన్నంత కోపమొచ్చింది. కీర్తిశేషుడైన భర్త శేషగిరి రూపం కళ్ళల్లో కదలాడింది.

"ఒకే కొడుకు, ఒకే కూతురు మనమదృష్ట వంతులం భారతీ!"

"ఔనండీ.... వీళ్ళిద్దర్నీ చదివించి పెళ్ళిళ్ళు ఒకేసారి చేసేస్తే.... కూతురు అత్తారింటికెళ్తుంది. కోడలు మనింటికొస్తుంది. మన శేష జీవితం హాయిగా గడుస్తుంది."

కళ్ళు తడై... బిందు రూపం దాల్చి కనుకొలుకుల్లోంచి రెండశ్రుబిందువుల్ని రాల్చి కపోలాల్ని తడిపేశాయి. బియ్యం డబ్బాలో కెత్తేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. ఉయ్యాల్లోంచి చంటిది కేర్ మంది. సీసాలో పాలు బోసి నోటికందించే సరికి రైలింజను కూతాగినట్టయింది. కొడుకు పెద్ద కూతురూ, కూతురు పెద్ద కొడుకూ మధ్యాహ్నం భోజనాలకొచ్చారు. వాళ్ళ భోజనాలై తిరిగి బడికెళ్ళిన తరువాత కంచాలు కడిగేసరికి రెండున్నరైంది.

28680



కాస్సేపు నడుం వాల్చుదామనేసరికి ఏంటిది, ఏడుపు లంకించుకుంది. అగ్ని పేష్ చేతిలో దినపత్రిక ముక్కముక్కలైంది.

మనవరాలినెత్తుకుని లాలించింది- పేపరు ముక్కలు ఊడ్చేస్తూ.

రోజూ ఇదే తంతు. ఉదయం నిద్రలేచిన్నుంచీ రాత్రి పడుకునే దాకా ఇదే బాగోతం. సాయంత్రం కొడుకూ-కోడలు ఇంటి కొచ్చేసరికి కాఫీ రెడీగుంచుతుంది.

“మా మంచి అమ్మ!” అంటాడు కొడుకు.

“మా అత్తయ్య దేవత....” అంటుంది కోడలు. కాని.... తనకేమనిస్తుందో వాళ్ళకనవసరం. ఓ పనిమనిషినో, ఆయానో చూడమందోసారి- తన అవస్థను అప్రత్యక్షంగా వ్యక్తం చేస్తూ.

“ఎంత ఆయా అయినా పరాయిదేకదా! పిల్లల్ని బెదిరిస్తుందే కాని ప్రేమగా లాలించదత్తయ్యా!” అంది కోడలు. నోరు విప్పలేము. పోనీ కూతురన్నా.... అదీ అంతే.

ఇప్పటివరకు కోడలి కాన్పులు, కూతురు కాన్పులు.... వారి ఉద్యోగాలు; ఇప్పుడు వారి సరదాలు, రేపు మనవలూ, మనవరాళ్ళ చదువులూ, ఉద్యోగాలూ, పెళ్ళిల్లూ సంసారాలు.

ఇక తనాశించిన శేష జీవితం గగన కుసుమమేనా? ఈ సంగతి కొడుకుతో ప్రస్తావించాలనుకుంటే.... గొంతులో పచ్చివెలక్కాయ ఇరికినట్టనిపిస్తుంది. మాట పెగలదు నోటికి తాళం పడుతుంది. కాని తాళం విప్పాలి....తప్పదు. భర్త గ్రాట్యుటీ, పీ.ఎఫ్ సొమ్ము తన వద్దే వుంది.

కామేశం అన్నయ్య ఎన్నో ఉత్తరాలు రాశాడు. 'నువ్వొస్తే మీ వదినా, నువ్వూ, నేనూ .. ముగ్గురం తీర్థయాత్రలికెళ్దాం' అని. ఏమిటో రాను రాను జీవితం....పంజరంలో చిలకలాగైంది.

కొడుకూ కోడలు ఆఫీసు నుంచి రాగానే,

"కామేశం మామయ్య ఉత్తరం రాశాడురా! మావయ్యా' అత్తయ్యా తీర్థయాత్రలకెళ్తున్నారట. నాకూ టికెట్ బుక్ చేయించారట.... రేపే వెళ్ళాలి" అంది కాఫీ అందిస్తూ.

"ఐతే మీరు వెల్తారా....?" వసంత నెత్తి మీద పిడుగు పడింది.

"మావయ్యలాగే రాస్తాడు. మా అమ్మ మనల్నీ, మనవలూ, మనవరాళ్ళనొదలి ఎక్కడికీ పోదు" అప్పుడే వచ్చిన వాసంతి కొట్టిపారేసింది- రాని నవ్వును పులుముకొని.

"మా అమ్మకు మనకంటే ఆత్మీయులెవరున్నారని వెల్తుంది?" నవ్వబోయాడు కొడుకు. ఇహ లాభం లేదనుకుని-

"ఉన్నార్రా....! కాశీ విశ్వనాథుడు అయోధ్యా శ్రీరాముడు ఇంకెందరో...!" నిర్ణయాత్మకంగా అంది భారతమ్మ.

కోడలూ, కూతురూ మొహాల మీద క్రమ్ముకుంటున్న ముచ్చెమటల్ని గమనించినా.... తన నిర్ణయం మార్చుకోదలచుకోలేదావిడ తృప్తిగా ఊపిరిపీల్చుకుంది.